క్లుప్తంగా

భారీ వర్షానికి కూలిన మెట్రోకెం పరిశ్రమ రక్షణ గోడ



కూలిన పరిశ్రమ రక్షణ గోడ

పరవాడ : జేఎన్ ఫార్మాసిటీలో మెట్రోకెం పరిశ్రమ యూనిట్ – 5కు చెందిన రక్షణ గోడ మంగళవారం కురిసిన భారీ వర్షానికి కుప్పకూలింది. యాజమాన్యం పరిశ్రమలో కొత్తగా ప్రహరీ గోడ నిర్మిస్తుంది. మంగళవారం రాత్రి 7 గంటల సమయంలో కురిసిన భారీ వర్షానికి సుమారు 50 మీటర్ల మేర గోడ కూలిపోయింది. వర్షం కారణంగా పనులు తాత్కాలికంగా నిలిపివేయడం వల్ల పెద్ద ప్రమాదం తప్పిందని యాజమాన్యం ప్రతినిధి మీడియాకు చెప్పారు.

చింతలగ్రహారంలో అన్నసమారాధన



గణపతిని దర్శించుకుంటున్న గండి రవి, కమిటీ ప్రతినిధులు

పెందుర్తి : వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా చింతలగ్రహారంలో బుధవారం అన్నసమారాధన ఏర్పాటు చేశారు. వైఎస్సార్‌సీపీ నేత గండి రవికుమార్ పాల్గొని వడ్డన ప్రారంభించారు. సుమారు 2 వేల మంది అన్నప్రసాదం స్వీకరించారు. సాయంత్రం నిమజ్జనోత్సవం ఘనంగా నిర్వహించారు. పవర్ బాయ్స్ యూత్ ప్రతినిధులు, గ్రామపెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

అప్పన్నకు విశేషంగా నిత్యకల్యాణం



యజ్ఞోపవీతధారణ ఘట్టాన్ని నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం నిత్యకల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ బేడా మండపంలో ఉదయం 9.30 గంటల నుంచి కార్యక్రమం నిర్వహించారు. స్వామి వారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై వేంజేపచేశారు. విశ్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామి వారి శేషవస్త్రాలు, ప్రసాదం, అక్షింతలు అందజేశారు. అర్చకుడు కుమారాచార్యులు కార్యక్రమాన్ని నిర్వహించారు.

సిటీ దయాగ్నస్టిక్ సెంటర్ సిద్ధం

ఆరిలోవ: విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(విమ్స్) ఆవరణలో రీజినల్ డ్రగ్ స్టోర్స్, సిటీ దయాగ్నస్టిక్ సెంటర్ సిద్ధమైంది. 2022 అక్టోబర్‌లో చేపట్టిన నిర్మాణ పనులు పూర్తయ్యాయి. త్వరలో వీటిని వైద్య శాఖాధికారులు అందుబాటులోకి తీసుకురానున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇక్కడ సుమారు అరెకరం స్థలంలో రూ.20 కోట్లతో దయాగ్నస్టిక్ సెంటర్ నిర్మాణం చేపట్టింది. ఇది ప్రారంభమైతే ప్రజలకు ఆధునిక పద్ధతిలో తక్కువ ధరలకు అన్ని రకాల పరీక్షలు అందాటులోకి రానున్నాయి. అవసరమైన పనిముట్లు, యంత్రాలు, ఎక్విప్‌మెంట్ తీసుకువచ్చి అమర్చాల్సి ఉంది. ఈ ల్యాబ్‌ల వల్ల రోగులకు కొంతమేర వైద్య ఖర్చులు తగ్గనున్నాయి.

రీజినల్ డ్రగ్ స్టోర్స్ ఏర్పాటు..

నాలుగు జిల్లాలకు కేంద్రంగా విమ్స్ ఆవరణలో రీజినల్ డ్రగ్ స్టోర్స్ ఏర్పాటు చేస్తున్నారు. విశాఖతోపాటు శ్రీకాకుళం, విజయనగరం, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాల్లో ప్రభుత్వ ఆస్పత్రులకు కేంద్రంగా మారనుంది. సిటీ దయాగ్నస్టిక్ సెంటర్ రేడియోలజీ విభాగంలో సి.టి.స్కాన్, ఎం.ఆర్.ఐ, యూఎస్‌జీ రూంలు, రేడియోలజీ ఎక్స్‌రే రూంలు, సాంపిల్ కలెక్షన్ రూంలు, డాక్టర్ చాంబర్లు, వైరాలజీ ల్యాబ్(బీఎస్ఎల్-2 లెవెల్స్), మైక్రో బయోలజీ, పాథాలజీ ల్యాబ్స్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస్, బయో కెమిస్ట్రీ ల్యాబ్, సెంట్రల్ రీసెర్చ్ ల్యాబ్స్ సిద్ధం చేస్తున్నారు.

రెచ్చిపోతున్న గ్రావెల్ మాఫియా

యథేచ్ఛగా గ్రావెల్ తవ్వకాలు.. విక్రయాలు

- మండలంలోని పలు గ్రామాల నుంచి అక్రమంగా తరలింపు
- పొక్లెయిన్లు, లారీల సాయంతో రాత్రి పూట రవాణా
- జగనన్న లే అవుట్ కాలనీలు, రోడ్లను సైతం విడిచిపెట్టని అక్రమార్కులు
- ఫిర్యాదులపై అధికారుల నామమాత్రపు చర్యలు

మండలంలో గ్రావెల్ మాఫియా రెచ్చిపోతున్నారు. గ్రావెల్ అక్రమ తవ్వకాలు యథేచ్ఛగా సాగిస్తూ మైనింగ్ మాఫియాను తలపిస్తున్నారు. ఇక్కడ పలు గ్రామాలతోపాటు జీవీఎంసీ పరిధిలోని గంగవరం, వెదుళ్లనరవ ప్రాంతాల్లోని కొండవాలు ప్రాంతాలు, ప్రభుత్వ భూములను సైతం విడిచిపెట్టడం లేదు. గత ప్రభుత్వం నుంచి గ్రావెల్ తవ్వకాలకు అనుమతులు లేకపోవడంతో అక్రమంగా గ్రావెల్ తరలిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. చుట్టుపక్కల ప్రాంతాల్లోని లేఅవుట్ల అభివృద్ధికి, ల్యాండ్ ఫిల్లింగ్‌కు, గృహ నిర్మాణాలకు గ్రావెల్‌ను తరలిస్తూ రోజూ లక్షలాది రూపాయలు అక్రమంగా ఆర్జిస్తున్నారు.



వెదుళ్లనరవ సమీపంలోని కొత్తూరు వద్ద ఓ ప్రైవేటు లే అవుట్‌లో నిల్వచేసిన గ్రావెల్



నంగినారపాడు, గంగవరం సమీపంలో ఏర్పాటు చేసిన జగనన్న లే అవుట్‌లో గ్రావెల్ తవ్వకాలు

సబ్బవరం: మండలంలోని గ్రావెల్ మాఫియా రేయింబవళ్లు తవ్వుతూ గ్రావెల్‌ను తరలించుకుపోతున్నారు. జీవీఎంసీ పరిధిలోని గంగవరం, వెదుళ్లనరవ, అజనగిరి ప్రాంతాలను ఆనుకొని వైఎస్సార్ అర్బన్ హౌసింగ్‌లో భాగంగా మెగా లేఅవుట్‌ను గత ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఆయా లేఅవుట్లను ఆనుకుని ఉన్న కొండవాలు ప్రాంతాలతో పాటు లే అవుట్లలోని ఖాళీ ప్రదేశాలు, రోడ్లను సైతం పొక్లెయిన్‌లతో తవ్వి రాత్రి పూట గ్రావెల్‌ను తీసుకెళ్లిపోతున్నారు.

స్టాక్ పాయింట్లలో నిల్వ.. ఆపై విక్రయాలు

జీవీఎంసీ పరిధి సంధ్యానగర్ కాలనీ, వెదుళ్లనరవ సర్వే నంబర్-34లోని ప్రభుత్వ స్థలంతోపాటు సర్వే నంబర్-1లోని ప్రైవేట్ లేఅవుట్లు, ఖాళీ ప్రదేశాల్లో స్టాక్ పాయింట్లు ఏర్పాటు చేసి గ్రావెల్‌ను నిల్వ చేస్తున్నారు. పగలు స్టాక్ పాయింట్ల నుంచి గాజువాక, దువ్వాడ, లంకెలపాలెం, స్టీల్ ప్లాంట్, కూర్మన్నపాలెం తదితర పారిశ్రామిక ప్రాంతాల్లోని లేఅవుట్ల అభివృద్ధికి, ల్యాండ్ ఫిల్లింగ్‌కు, గృహ నిర్మాణ అవసరాలకు గ్రావెల్‌ను తరలించి అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారు. పగలు డిమాండ్ మేరకు తరలించి ఒక్కో డంపర్‌ను రూ.5 వేల నుంచి 8 వేల వరకు విక్రయిస్తున్నారు.

ప్రభుత్వ హౌసింగ్ లేఅవుట్‌నూ వదల్లేదు..

మండలంలోని పైడివాడ అగ్రహారం, పైడివాడ, ఎరుకునాయుడుపాలెం గ్రామాలను ఆనుకుని గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అర్బన్ హౌసింగ్ మెగా లే అవుట్‌ను ఏర్పాటు చేసింది. దీనిని గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ లేఅవుట్‌లో నిర్మించిన అర్బన్ హౌసింగ్ గృహాలు, రోడ్లను సైతం విడిచిపెట్టకుండా అక్రమార్కులు గ్రావెల్ తవ్వకాలు చేపట్టి తరలించుకుపోయారు. దీనిపై స్థానికులు ఫిర్యాదు చేయడంతో పోలీసులు, రెవెన్యూ అధికారులు పొక్లెయిన్, లారీలను పట్టుకుని మైనింగ్ అధికారులకు అప్పగించారు. పట్టుకున్న వాహనాలను సైతం మొక్కుబడి చర్యలతో వదిలిపెట్టారు.

ఫిర్యాదులు చేస్తున్నా.. ఆగని వైనం

మైనింగ్, రెవెన్యూ అధికారులకు స్థానికులు ఫిర్యాదులు చేస్తున్నా.. గ్రావెల్ అక్రమ తవ్వకాలు ఆగడం లేదు. రెవెన్యూ సిబ్బంది, పోలీసులు పట్టుకున్న వాహనాలను సైతం మైనింగ్ అధికారులకు అప్పగించినప్పటికీ నామమాత్రపు పెనాల్టీలు



పైడివాడ అగ్రహారం జగనన్న అర్బన్ హౌసింగ్ లే అవుట్‌లో గృహ నిర్మాణాలను ఆనుకుని చేపట్టిన గ్రావెల్ తవ్వకాలు

విధించి వాహనాలను విడిచిపెడుతున్నారు. దీంతో యథావిధిగా గ్రావెల్ తవ్వకాలు చేపడుతున్నారు. ఫిర్యాదులపై మైనింగ్ అధికారులు స్పందించకపోవడం, పట్టుబడిన వాహనాలను నామమాత్రపు జరిమానాలతో విడిచిపెట్టడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు దృష్టి సారించి గ్రావెల్ అక్రమ తవ్వకాలపై కఠిన చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేశాం



గంగవరం, వెదుళ్లనరవ, నంగినారపాడు గ్రామాల్లో ల్యాండ్ పూలింగ్‌కు ఇచ్చిన భూముల్లో గ్రావెల్ తవ్వకాలు చేపడుతున్నట్లు స్థానికుల నుంచి ఇటీవల ఫిర్యాదులు అందాయి. ఆర్ఐ, వీఆర్వోలు, వీఆర్ఏలను అప్రమత్తం చేసి వాహనాలను పట్టుకుని పోలీసులకు అప్పగించాం. చర్యలు తీసుకోవాలని మైనింగ్ అధికారులకు సమాచారం అందించాం. అక్రమంగా గ్రావెల్ తరలించే వారు, తవ్వే వారిపై కేసులు నమోదు చేసి క్రిమినల్ చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేశాం.

– వెంకట అప్పారావు, డిప్యూటీ తహసీల్దార్, సబ్బవరం మండలం

పరవాడ ఎంపీడీవోగా శ్యామ్‌సుందర్



పరవాడ: పరవాడ ఎంపీడీవోగా సంగంరెడ్డి దుర్గాశ్యామ్‌సుందర్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన చోడవరం ఎంపీడీవోగా పనిచేసి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పనిచేసిన హేమసుందరావు చీడికాడ బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా శ్యామ్‌సుందర్ మీడియాతో మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులు, మండల ప్రజలు, అధికారుల సహకారంతో మండల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

పైడమ్మ బంద గండిని పూడ్చాలి



నీట మునిగిన ఎస్సీ కాలనీని పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పరవాడ : పరవాడలో మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షాలకు నీట మునిగిన ఎస్సీ కాలనీ, గండి పడిన పైడమ్మ బందను వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రామునాయుడు సందర్శించారు. స్థానికులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. పైడమ్మ బంద గండిని త్వరితగతిన పూడ్చివేసేలా అధికారులపై ఒత్తిడి తీసుకొస్తానని సీఈసీ సభ్యుడు శ్రీనివాసరావు రైతులకు హామీ ఇచ్చారు. అదేవిధంగా మరో రెండు రోజులపాటు వర్షాలు కురిసే అవకాశాలున్నాయని, కాలనీ వాసులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కాలనీ వాసుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పరిసరాల పరిశుభ్రతపై సూచనలు చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ బండారు రామారావు, ఆర్ఈసీఎస్ మాజీ చైర్మన్ చల్లా కనకారావు, వర్రి నూకేంద్ర, గండి వాసు పాల్గొన్నారు.

ఆధునిక సాగు పద్ధతులతో అధిక దిగుబడులు



బంగారమ్మపాలెంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఉమామహేశ్వరరావు

సబ్బవరం : ఆధునిక వ్యవసాయ పద్ధతులతో అధిక దిగుబడులు సాధించవచ్చని అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త దాడి ఉమామహేశ్వరరావు సూచించారు. మండలంలోని ఆరిపాక, బంగారమ్మపాలెం గ్రామాల్లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విచక్షణారహితంగా ఎరువుల వాడకం, కలుపు నివారణ చేపట్టకపోవడం వల్ల చీడపీడలు ఉధృతం కావడంతో దిగుబడులపై తీవ్ర ప్రభావం పడుతోందన్నారు. జిల్లా ఉద్యానవన శాఖ అధికారి ఎం.ప్రభాకరరావు మాట్లాడుతూ ఉద్యానశాఖ ఆధ్వర్యంలో రైతులకు మంచి పథకాలతోపాటు రాయితీ కూడా ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ నుంచి వచ్చిన వెటర్నరీ డాక్టర్ స్వర్ణలత పశువులకు ఇచ్చే టీకాలు, పశుపోషణపై పాడి రైతులకు వివరించారు. కార్యక్రమంలో స్థానిక వ్యవసాయ అధికారి పోతల సత్యనారాయణ, పి.అపర్ణ, శరగడం రాము, రాపేటి రాము, రామకోటి, మళ్ల శ్రీను, దాడి కన్నంనాయుడు పాల్గొన్నారు.

బిందు సేద్యం రైతులకు లాభదాయకం

పరవాడ : వరిలో సాంబమసూరి రకానికి బదులుగా ప్రత్యామ్నాయంగా ఎంటీయూ 1224 రకాన్ని సాగ చేయడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త పద్మావతి చెప్పారు. వాడచీపురుపల్లి, భరిణికం గ్రామాల్లో బుధవారం నిర్వహించిన 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో ఆమె పాల్గొని రైతులకు సలహాలు సూచనలు అందజేశారు. ఏపీఎంఐపీ ప్రాజెక్టు డైరెక్టర్ జి.వి.లక్ష్మి మాట్లాడుతూ బిందు, తుంపర్ల సేద్యం రైతులకు లాభదాయకమని తెలియజేశారు. అందుకు సంబంధించిన సూచనలు అందజేసి రాయితీ వివరాలు తెలియజేశారు. పరవాడ వ్యవసాయాధికారి సీహెచ్.చంద్రావతి మాట్లాడుతూ రబీ సీజన్‌లో విత్తనోత్పత్తికి జనుము సాగు లాభదాయకంగా ఉంటుందన్నారు. అనకాపల్లి ప్రభుత్వ నర్సరీలో రాయితీపై జీడిమామిడి, కొబ్బరి మొక్కలు అందజేయడానికి సిద్ధంగా ఉన్నాయని ఉద్యానవన అధికారి లావణ్య చెప్పారు. ముందుగా వాడచీపురుపల్లిలో ఏర్పాటు చేసిన ప్రకృతి వ్యవసాయం, జీవన ఎరువుల ప్రదర్శనను ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు తిలకించారు. కార్యక్రమంలో బొండా తాతారావు, బొండా సన్యాసిరావు, దాట్ల గణేష్‌రాజు, వరహాలరాజు, బొండా గోవిందు, ప్రగడ శ్రీను, టి.బైరాగిరాజు, పిల్లి మంగ పాల్గొన్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న చంద్రావతి

భారీ వర్షానికి చెరువుకు గండి



భారీ వర్షానికి కొట్టుకుపోయిన పైడమ్మ బంద గట్టు



చెరువును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల

- త్వరితగతిన పూడ్చాలని ఎమ్మెల్యే పంచకర్ల ఆదేశం

పరవాడ: మండలంలో మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి పరవాడ గ్రామంలోని పైడమ్మ బంద గట్టుకు పడిన గండిని యుద్ధ ప్రాతిపదికన పూడ్చాల్సిందిగా ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు ఇరిగేషన్ ఏఈ రామలక్ష్మణరావును ఆదేశించారు. చెరువుకు గండి పడిన ప్రాంతాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. త్వరితగతిన గండిని పూడ్చి, నీరు వృథా కాకుండా అడ్డుకోవాలన్నారు. చెరువులో చేరిన అదనపు నీరు దిగువకు పోయే ఏర్పాట్లు చూడాలన్నారు. కాలువలు, కల్వర్టుల్లో పేరుకుపోయిన పూడికలను తొలగించి చెరువుకు సజావుగా వర్షపు నీరు వచ్చేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఎమ్మెల్యే వెంట పరవాడ సర్పంచ్ సిరపరపు అప్పలనాయుడు, కూటమి నేతలు పైల జగన్నాథరావు, పైల రామచంద్రరావు, రెడ్డి శ్రీనివాసరావు, మోటూరు సన్యాసినాయుడు, వియ్యపు చిన్న, బుగిడి రామగోవిందరావు, కూండ్రపు సోమునాయుడు, రాజాన సత్యం, వ్యవసాయాధికారి సీహెచ్ చంద్రావతి, ఇరిగేషన్ ఏఈ రామలక్ష్మణ తదితరులు ఉన్నారు.

అంతర్జాతీయ స్థాయిలో లా యూనివర్సిటీ విద్యార్థుల సత్తా



డీఎస్ఎన్ఎల్‌యూ విద్యార్థులకు విజేత ట్రోఫీ అందజేస్తున్న నిర్వాహకులు



విజేతలు వినీల, అంకితను అభినందిస్తున్న వీసీ ఆచార్య సూర్యప్రకాశరావు

- ఏఐఏడీఆర్ మీడియేషన్ కాంపిటీషన్ – 2024 చాంపియన్లకు అభినందనలు

సబ్బవరం: ఆసియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆల్టర్‌నేటివ్ డిస్ప్యూట్ రిజల్యూషన్(ఏఐఏడీఆర్) నిర్వహించిన 2వ ఇంటర్నేషనల్ మీడియేషన్ కాంపిటీషన్-2024 చాంపియన్లుగా దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం విద్యార్థులు నిలిచారని వీసీ ఆచార్య డి.సూర్యప్రకాశరావు బుధవారం తెలిపారు. మలేషియా కౌలాలంపూర్‌లో 2వ ఏఐఏడీఆర్ అంతర్జాతీయ క్రాస్-యూనివర్సిటీ నిర్వహించిన ఈ పోటీల్లో ఫోర్త్ ఇయర్ విద్యార్థులు వినీల కొత్తపల్లి, అంకిత వర్ధిక విజేతలుగా నిలిచి తమ యూనివర్సిటీకి గర్వకారణంగా నిలిచారని ఆయన కొనియాడారు. ప్రతిష్టాత్మక నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ సింగపూర్ నుంచి ఆండ్రూ టియో, అలిస్సా లీ, సెలిన్ యో ఫ్రాన్సిస్కోతో కలిసి ఒక క్రాస్-యూనివర్శిటీ బృందాన్ని ఏర్పాటు చేశారన్నారు. ఓపీ జిందాల్ గ్లోబల్ లా స్కూల్, నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ మలేషియా వంటి అగ్రశ్రేణి జట్లతో పోటీపడిన డీఎస్ఎన్ఎల్‌యూ జట్టు అసాధారణమైన నైపుణ్యాన్ని ప్రదర్శించి ప్రపంచ రౌండ్‌లో విజేతగా నిలిచిందని చెప్పారు. ఈ పోటీలో భారతదేశం, చైనా, సింగపూర్, మలేషియా, ఇండోనేషియా, థాయిలాండ్‌తో సహా 7 దేశాల నుంచి 27 జట్లు పాల్గొన్నాయన్నారు. మొదటి రెండు ప్రాథమిక రౌండ్‌ల నుంచి టాప్ 8 జట్లు ప్రపంచ రౌండ్‌లకు అర్హత సాధించాయని పేర్కొన్నారు. ఫైనల్ రౌండ్‌కు న్యాయ నిర్ణేతలుగా ఎంఎస్ లియోనారా రీసెన్‌బర్గ్, జైన్, శాంతి అబ్రహం వ్యవహరించారని తెలిపారు. ఈ సందర్భంగా విజేతలుగా నిలిచిన విద్యార్థులను డీఎస్ఎన్ఎల్‌యూ వీసీ సూర్యప్రకాశరావు అభినందించారు.

గుజరాతీ కార్పొరేట్ వలస దోపిడీని ఎదురిద్దాం



జీవీఎంసీ గాంధీ పార్కులో దీక్షలో పాల్గొన్న వెంకటరెడ్డి, తదితరులు

సీతమ్మధార : గుజరాతీ కార్పొరేట్ వలస దోపిడీని ఎదిరిద్దామని జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) గౌరవ అధ్యక్షుడు పి. వెంకటరెడ్డి పిలుపునిచ్చారు. జీవీఎంసీ గాంధీ పార్కులో స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జరుగుతున్న దీక్షకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో మంది ప్రాణత్యాగంతో ఆవిర్భవించిన ప్లాంట్‌ను అప్పనంగా బడా వ్యాపారులకు విక్రయించేందుకు మోదీ ప్రభుత్వం పన్నుతున్న కుట్రలను తిప్పికొట్టాలన్నారు. అంబానీ, రిలయన్స్ తదితర ఉత్పత్తులను బహిష్కరిస్తామని హెచ్చరించారు. ఆనాడు సీపీఎం, సీపీఐ ఎమ్మెల్యేలు, ఎంపీలు రాజీనామాలు చేసి స్టీల్‌ప్లాంట్ సాధనకు కృషి చేశారన్నారు. ఈ రోజు ప్లాంట్‌ను ప్రైవేట్‌పరం చేస్తే తగిన విధంగా బుద్ధి చెబుతామన్నారు. స్టీల్‌ప్లాంట్ లేని విశాఖ నగరాన్ని ఊహించుకోలేమన్నారు. ఈ కార్యక్రమంలో రమణ, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు

పరవాడ : ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు అన్నారు. వాడచీపురుపల్లి గ్రామంలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన వంద రోజుల్లో చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు వివరించారు. ప్రజలకిచ్చిన హామీల అమలుపై సందేహాలు వద్దన్నారు. వాటిని నెరవేర్చడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి చేస్తున్నారని చెప్పారు. వాడచీపురుపల్లి గ్రామాభివృద్ధి కోసం రూ.60 లక్షలు మంజూరు చేస్తానని చెప్పారు. వాడచీపురుపల్లి, శివారు గ్రామాల్లో తాగునీరు, రోడ్లు, కమ్యూనిటీ భవనాలు, రామాలయం అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు. అనంతరం గ్రామంలో ఇంటింటికీ వెళ్లి స్టిక్కర్లు అతికించారు. కార్యక్రమంలో పరవాడ మాజీ ఎంపీపీ మాసవరపు అప్పలనాయుడు, పరవాడ జెడ్పీటీసీ మాజీ సభ్యుడు పైల జగన్నాథరావు, పెందుర్తి బీజేపీ ఇన్‌చార్జి గొర్లి రామునాయుడు, సర్పంచ్ శివలంక లక్ష్మి, టీడీపీ మండల అధ్యక్షుడు వియ్యపు చిన్న పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు బానిసలైతే జీవితం నాశనమే



పోస్టర్ ఆవిష్కరిస్తున్న విజయ్‌కుమార్, తదితరులు

పెందుర్తి : యుక్త వయసులో జీవితంలో ఎదగాలన్న పట్టుదలతో ముందుకు సాగాలని.. చెడు మార్గంలో పయనించి జీవితాలను నాశనం చేసుకోవద్దని ఉమ్మడి విశాఖ జిల్లా డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్.విజయ్‌కుమార్ సూచించారు. 'డ్రగ్స్ వాడకం – అనర్థాలు' అనే అంశంపై స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులకు బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి కాలంలో యువత డ్రగ్స్, ఇతర మాదకద్రవ్యాలకు బానిసలై జీవితాలను సర్వనాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎట్టి పరిస్థితిలోనూ చెడు మార్గం వైపు వెళ్లొద్దని, తప్పుడు మార్గంలో పయనిస్తే జైలుపాలై కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి వస్తుందని హెచ్చరించారు. ప్రతీ విద్యార్థి క్రమశిక్షణ, పట్టుదలతో చదువుకుని ఉన్నతస్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.చంద్రశేఖర్ ఆధ్వర్యంలో డ్రగ్స్ నివారణపై పోస్టర్ ఆవిష్కరించారు. విద్యార్థుల సందేహాలు నివృత్తి చేశారు. డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్లు కె.కల్యాణి, వి.అభిప్రియ, ఎం.శ్రీనివాస్, ఎస్.కల్యాణి పాల్గొన్నారు.

సింహగిరిపై పనులు వేగవంతం చేయండి



ఈవోకి వినతిపత్రం అందజేస్తున్న శ్రీనుబాబు

సింహాచలం : సింహగిరిపై మైక్రో టవర్‌కి వెళ్లే మార్గంలో కొండపై ఏర్పాటు చేస్తున్న తిరునామాల పనులను వెంటనే పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని సింహాచలం దేవస్థానం ఈవో త్రినాథరావుని దేవస్థానం పాలక మండలి మాజీ సభ్యుడు గంట్ల శ్రీనుబాబు కోరారు. ఈ మేరకు పలు విషయాలతో కూడిన వినతిపత్రాన్ని సింహగిరిపై ఈవోకి బుధవారం అందజేశారు. జీఆర్‌టీ జ్యూయలర్స్ సహకారంతో తిరునామాల పనులు జరుగుతున్నాయని, త్వరలోనే పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. గత పాలకవర్గం సమావేశాల్లో తాము పలు అభివృద్ధి పనులకు సంబంధించి ప్రతిపాదనలు చేశామని, వాటిని త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. కొండదిగువన వరాహ పుష్కరిణి వద్ద మూడు పుష్కర్ ఘాట్ల నిర్మాణం త్వరగా పూర్తి చేయాలని, బంగారమ్మ ఆలయం నిర్మాణ పనులు వేగవంతం చేయాలని కోరారు. అలాగే పైడితల్లి ఆలయ అభివృద్ధి పనులు కూడా వీలైనంత త్వరలో ప్రారంభించాలని కోరారు. శ్రీనివాసనగర్‌లో నిర్మాణం పూర్తయిన నూతన కల్యాణ మండపాలను భక్తులకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. వీటిపై స్పందించిన ఈవో త్రినాథరావు మాట్లాడుతూ తిరునామాల పనులు నెలాఖరులోగా పూర్తి చేస్తామన్నారని శ్రీనుబాబు తెలిపారు.

వైద్య రంగంలో ఫార్మసిస్టులకు ప్రాధాన్యం



రాష్ట్ర ఫార్మసీ కౌన్సిల్ రిజిస్ట్రార్ డాక్టర్ విలియం క్యారీతో విద్యార్థులు

మురళీనగర్ : వైద్య రంగంలో ఫార్మసీ నిపుణులకు అత్యంత ప్రాధాన్యత ఉందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఫార్మసీ కౌన్సిల్ రిజిస్ట్రార్ డాక్టర్ విలియం క్యారీ అన్నారు. కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నారాయణరావు అధ్యక్షతన బుధవారం నిర్వహించిన ప్రపంచ ఫార్మాసిస్ట్ దినోత్సవంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. రోగులను వైద్యులు పరీక్షించి వ్యాధి నిర్ధారణ చేసిన తర్వాత వాడాల్సిన మందులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియజేసేది ఫార్మసిస్టులే అని పేర్కొన్నారు. మందుల వాడకంలో మన సొంత పరిజ్ఞానాన్ని వాడకూడదన్నారు. ఈ విషయంలో ఫార్మసీ విద్యార్థులు పరిసరాల్లోని ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని పిలుపునిచ్చారు. ఫార్మాసిస్టులకు మంచి ఉద్యోగావకాశాలు ఉన్నాయని ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నారాయణరావు అన్నారు. అనంతరం డాక్టర్ విలియం క్యారీని ఘనంగా సత్కరించారు.